క్లుప్తంగా

దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ పరీక్షలు

ఏటూరునాగారం: రాజీవ్ యువ వికాసం టీఎస్ ఓబీఎంఎంఎస్ కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 26, 27, 28న స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26న ఏటూరునాగారం, అల్లం వారిఘణపురం, చెల్పాక, రొయ్యూర్, మల్లకట్ట, శంకరాజుపల్లి గ్రామాల్లోలకు చెందిన దరఖాస్తుదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది, అధికారులతో స్క్రీనింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే ఈనెల 27న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, అధికారులు కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో చిన్నబోయినపల్లి, షాపెల్లి, శివాపురం, ఏటూరునాగారం గ్రామాల్లోని దరఖాస్తుదారులకు అదేవిధంగా ఈనెల 28వ కెనరాబ్యాంక్ సిబ్బంది, అధికారులు కలిసి రామన్నగూడెం, కోయగూడ ఎల్లాపురం, ఏటూరునాగారం దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ టెస్టు ఉంటుందన్నారు.

కమిటీ ఎన్నిక


కుమార్, అధ్యక్షుడు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ కమిటీని హనుమాన్ భక్తులు, గ్రామస్తులు శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూల కుమార్, గౌరవ అధ్యక్షులుగా సూరపనేని వెంకటసురేష్, పైడాకుల కృష్ణమూర్తి లు, ఉపాధ్యక్షులుగా పల్లపు కుమార్, పంగ రవీందర్, ప్రధాన కార్యదర్శి బత్తిని వెంకట్ గౌడ్, కోశాధికారిగా అంకం వినయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం



వెంకటాపురం(ఎం): మండలంలోని బీసీ కాలనీకి చెందిన మునేందర్ కేన్సర్‌తో ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శనివారం ఆదర్శ యూత్ సభ్యులు రూ.16వేల నగదును అందించగా, కాలనీవాసులు రూ.4200లు ఆర్థికసాయం అందించారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పెంకవాగు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాలు.. పెంకవాగు గ్రామానికి చెందిన మడే లక్ష్మయ్య అనే వ్యక్తి ఈ నెల ఒకటిన మద్యం మత్తులో భార్య సీతతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఎక్కడ వెతిన దొరకపోవడంతో లక్ష్మయ్య తమ్ముడు మడే పాపారావు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైన అచూకి తెలిస్తే ఎస్సై నంబర్ 871260 0988, స్టేషన్ నంబర్ 87126 70099కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పుట్ట మధుపై పోలీసులకు ఫిర్యాదు



కాటారం: మహిళలను కించపర్చే విధంగా మాట్లాడిన పెద్దపల్లి మాజీ జెడ్పీచైర్మన్ పుట్ట మధుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాళేశ్వరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పుట్ట మధు ఐఏఎస్ అధికారిణి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యార్ మహిళా అని చూడకుండా తీవ్రపదజాలంతో దూషించారని ఫి ర్యాదులో పేర్కొన్నారు. మహిళాలోకం మనోభావా లను దెబ్బతీసే విధంగా వారి హక్కులను ఉల్లంఘించేలా పుట్ట మధు వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. పుట్ట మధు వ్యాఖ్యలపై విచారణ జరిపి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి ఎస్సై గీతా రాథోడ్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అయిత శకుంతల, ఎలుబాక సుజాత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, రమేష్, ఆర్ల నాగరాజు, చీర్ల తిరుపతిరెడ్డి, రాజయ్య ఉన్నారు.

పరామర్శ

కాటారం: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాల విధుల్లో భాగంగా వడదెబ్బతో మృతి చెందిన మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుట్ట మధు వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, కుడుదుల రాజబాపు, నరివెద్ది శ్రీనివాస్ ఉన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- ముమ్మరంగా దుక్కుల దున్నకం
- విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

వెంకటాపురం(కె): అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారం రోజుల్లో రుతుపవణాలు కూడా రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. గత సంవత్సరం వ్యవసాయం దెబ్బతిన్న అన్నదాతలు ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో వానకాంలం సాగుపై కోటి ఆశలతో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ అధికారులు సాగుకు అవసరమైన విత్తనాలు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వెంకటాపురం మండలంలో మొత్తం సాగు పది వేల హెక్టర్లలో ఉంది. మండలంలో రైతులు ముఖ్యంగా వరి, మొక్కజొన్న, మినుము పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. రైతులు సాగు చేసే పంటల ప్రణాళికలను సైతం వ్యవసాయ అధికారులు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలం గడిచిపాతుండడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. చేలను ట్రాక్టర్లతో దున్నిచ్చి ఎరువులను పంట పొలాలకు చేరవేయటం, విత్తనాలు కొనుగోలు చేసి సాగుకు సిద్ధమవుతున్నారు.


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు


దుక్కిలో పోసిన సేంద్రియ ఎరువు

రైతులు జాగ్రత్తగా ఉండాలి



విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తంగా ఉండాలి. లైసెన్స్ పొందిన ఎరువుల షాపుల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రశీదు రైతులు తప్పని సరిగా తీసుకోవాలి. ప్రతి రైతు ఆధార్ కార్డుతోనే ఎరువులు తీసుకోవాలి.

– నవీన్, మండల వ్యవసాయ అధికారి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


వెంకటాపురం(కె): చెక్కు అందజేస్తున్న నాయకులు


వాజేడులో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం గ్రామానికి చెందిన నర్సింహారావు, మండల కేంద్రానికి చెందిన నాగేంద్ర ప్రసాద్, వాడగూడేనికి చెందిన లక్ష్మిదేవిలకు పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు చెక్కులను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పాయం రమణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు చిడెం శివ, బాలసాని వేణు, పిల్లారి శెట్టి మురళి, బాలసాని శ్రీను ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ అందజేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాట్ల వీరవెంకటసీతారామరాజు, కల్యాణ్, కాలీకృష్ణ, ఖాజావలి, రాంబాబు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కాలం చెల్లిన విత్తనాలు విక్రయించొద్దు


మాట్లాడుతున్న మహేష్

వాజేడు: కాలం చెల్లిన మందులు, విత్తనాలు, ఎరువులు విక్రయించవద్దని మండల వ్యవసాయాధికారి ముంజ మహేశ్ అన్నారు. మండల పరిధిలోని రైతు వేదికలో శనివారం మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దుకాణాల వద్ద ధరలు, నిల్వ పట్టిక ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఏఈఓ హరీష్, డీలర్లు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

- ఎంపీడీఓ సుమనవాణి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వర్షకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుమనవాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, ప్రమాదాల నివారణ చర్యలపై మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీజనల్ వ్యాధుల నివారణ చర్యల కోసం ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి అడెపు చిరంజీవి మాట్లాడుతూ.. వర్షకాల సీజనల్‌లో ఎక్కువగా దొమల కాటు వలన జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని రోడ్లపై గుంతలు ఉన్న చోట నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అలాగే ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. వర్షాలకు రోడ్ల వెంట చెట్లు కూలిన సమయంలో తొలగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సుమనవాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతీ ఒక్క అధికారి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నీటి మడుగులు ఉన్న ప్రదేశాల్లో మట్టితో పూడ్చివేయాలన్నారు. ఈసమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో విధులు నిర్వహించి బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్ లక్ష్మిరాజయ్యను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో పాటుగా అన్ని రాజకీయ పార్టీ నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యాక్రమంలో మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు, జక్కుల శ్యామ్, పడాల రమేష్, బెజ్జిని పూర్ణ, బీఆర్ఎస్ నాయకులు గంపా రాంబాబు, దర్రా దామోదర్, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన రావు, చిడెంశివ, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ, పిల్లారి శెట్టి మురళి తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్నారం, గంగారంలోని గొత్తికోయగూడెలల్లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలలోని పిల్లలకు పాదరక్షలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. మండలంలోని కొత్తూరు, గొనెపల్లి, వెంగ్లాపూర్‌లోని శివాలయం, రామాలయం, కన్నెపల్లి, మేడారం, కాల్వపల్లి, ఊరట్టం గ్రామాల్లో మొత్తం 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులు, వ్యాపారులు కృషి చేయాలన్నారు.

శ్రీధర్‌బాబు మెప్పు కోసం ఆరాటం


మాట్లాడుతున్న నాయకులు

కాటారం: నియోజకవర్గంలోని సమస్యలపై పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే వాటిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూ మంత్రి శ్రీధర్‌బాబు మెప్పు కోసం కాంగ్రెస్ నాయకులు ఆరాటపడుతున్నారని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, దళిత నాయకుడు జక్కు శ్రావణ్ అన్నారు. కాటారం మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తోటి దళితుడికి అవమానం జరిగిన పట్టించుకోకుండా కాంగ్రెస్ దళిత నాయకులు మంత్రి సేవలో తరిస్తున్నారని విమర్శించారు. దళిత ఎంపీకి పుష్కరాల్లో ప్రోటోకాల్ అవమానం జరిగితే పార్టీలకు అతీతంగా దళితులు, బలహీన వర్గాల పక్షాన పుట్ట మధు ప్రభుత్వ అధికారులు, పాలకవర్గం, మంత్రిని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. పుష్కరాల విధుల్లో వడదెబ్బకు గురై పారిశుద్ధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ చనిపోతే అనారోగ్యంతో చనిపోయాడని కాంగ్రెస్ నాయకులు అనడం సరికాదన్నారు. తక్షణం ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొండగొర్ల వెంకటస్వామి, నరివెద్ది శ్రీనివాస్, కొడపర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలు

ప్రధాన ఘాట్ బురదమయం



పలిమెల: కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాల కోసం ప్రధాన ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు బురదమయం అయ్యాయి. దాంతో వచ్చిన భక్తులు బురదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూర్చోని సేదదీరడానికి, పిండ ప్రదానం కార్యక్రమం నిర్వహించుకోవడానికి ఇబ్బంది పడుతూ ఎండలోనే పిండప్రదానాలు చేస్తున్నారు.

సొమ్మసిల్లిన భక్తురాలు



చిట్యాల: పుష్కరాలకు వచ్చిన గోదావరిఖనికి చెందిన ఓ భక్తురాలు ఉపవాసంతో పుష్కర స్నానం ఆచరించి మెట్లు ఎక్కుతుండగా సొమ్మసిల్లింది. దీంతో ఆమె కొడుకు తోటి భక్తుల సాయంతో మెడికల్ క్యాంపుకు వెళ్లి ఓఆర్ఎస్ అడగగా సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేవని అన్నారు. కాగా అక్కడే ఉన్న 108 సిబ్బంది గమనించి వారి వద్ద ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చినట్టు భక్తులు తెలిపారు. దీంతో ఆమెకు ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగించడంతో స్పృహలోకి వచ్చిందన్నారు.

దిగబడిన భారీ క్రేన్

చిట్యాల: ఏదైన వాహనం దిగబడితే తియ్యాల్సిన భారీ క్రేనే బురదలో దిగబడింది. కాళేశ్వరం పుష్కరాల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండు నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లె దారిలో భారీ క్రేన్ దిగబడడంతో ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొన్నాయి.



జ్ఞాపకం పదిలం



పలిమెల: కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాలకు వచ్చిన భక్తులు పుష్కరస్నానం ఆచరించిన అనంతరం ఘాట్ సమీపంలో ఉన్న శివుడి వద్ద ఫొటో దిగుతున్నారు. ఈ క్రమంలో భక్తులు తమ జ్ఞాపకాలను ఫొటోల రూపంలో మొబైల్ ఫోన్లతో పాటు కెమెరాల్లో జ్ఞాపకాలు పదిల పరుచుకుంటున్నారు.

పుష్కర ఘాట్‌కు దారేది?



చిట్యాల: కాళేశ్వరం ముక్తీశ్వరస్వామి ఆలయం వెనకాల నుంచి సరస్వతి నది పుష్కరఘాటుకు వెళ్లడానికి దారి లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నీరు చేరింది. దీంతో అటుగా వెళ్తున్న భక్తులు అవస్థలు పడుతున్నారు. అలాగే ప్రైవేట్ వాహనాలు రోడ్డుపై నిలుపడంతో భక్తులు షాపుల ముందు నుంచి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.

చెత్తాచెదారం తొలగింపు



పలిమెల: సరస్వతి పుష్కరాల్లో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నాలాలు చెత్త చెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగు నీరు నిలువకుండా పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటి కప్పుడు చెత్తను తొలగిస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మల్హర్: సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరం ప్రధాన రహదారిలో చిరంజీవి కళజాతా బృందం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంకు సహకారంతో బ్యాంకుల్లో జరిగే సైబర్ నేరాలపై భక్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ అందిస్తున్న సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై తదితర వాటిపై భక్తులకు వివరించారు. కళాబృందం సభ్యులు శ్రీనివాస్, సాయి కృష్ణ, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్ట కూటి కోసం..



కాటారం: పుష్కరాల్లో భాగంగా ఓ వ్యక్తి గాంధీజీ వేషాధారణతో భిక్షాటన చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ప్రధాన ఆలయం ఉత్తర ద్వారం సమీపంలో సదరు వ్యక్తి గాంధీ వేషాధారణతో గంటల పాటు నిలబడి ఉండగా అటు వైపుగా వచ్చిన చిన్నారులు, పెద్దలు సెల్ఫీలు దిగి తమకు తోచినంత సహాయం అందించారు.

గోదావరి వరదలపై అప్రమత్తత అవసరం

- మండల ప్రత్యేకాధికారి అప్పల నాయుడు


వెంకటాపురం(కె): మాట్లాడుతున్న అప్పల నాయుడు


ఏటూరునాగారం: మాట్లాడుతున్న రాంపతి

వెంకటాపురం(కె): గోదావరి వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి అప్పల నాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గోదావరి వరదలపై మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలుకు సమాచారం అందించాలన్నారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం: వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాంపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏటూరునాగారం, మంగపేట మండలాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల, గ్రామ అధికారులు మండల హెడ్ క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలన్నారు. వరదలు, వాగులు, చెరువులు, కరకట్ట, శిథిలమైన ఇళ్లు వాటిని ముందే గుర్తించి కావాల్సిన మరమ్మతులు చేయించాలన్నారు. గోదావరి, వాగుల వద్ద డ్యూటీలు చేసే అధికారులు సమాచారం ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు అందించాలన్నారు. గురుకుల పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. విద్యార్థులు విషపురుగుల బారిన పడకుండా పలు జాగ్రత్తలను తీసుకోవాలని పాఠశాలల యజమాన్యానికి సూచనలు చేయాలన్నారు. కాజ్‌వేలు, చిన్న బ్రిడ్జిల వద్ద, వాగు నడక దారుల్లోని కొండాయి, ఎలిశెట్టిపల్లి వాగుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు పడవలను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీలోని దోమల నివారణ కోసం నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. వర్షాకాలం ముగిసే వరకు గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న లక్ష్మణ్‌బాబు

మల్హర్: విద్యాశాఖ ఆదేశాలతో మండల స్థాయిలో ఐదు రోజుల పాటు ఎంఈఓ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శని వారంతో ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మణ్‌బాబు మాట్లాడ ుతూ.. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు అందరూ కూడా శిక్షణ ఇచ్చిన ఆర్పీలు చెప్పిన ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్పీలు శిక్షణను విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని చెప్పారు.